# విముక్తి

"యేమండీ... మిమ్మల్నే... స్టవ్ మీద కుక్కర్ పెట్టాను. నాల్గు విజిల్స్ రాగానే స్టవ్ ఆఫ్ చెయ్యండి" అంది ఊర్మిళ.

హాల్లో కూర్చొని ఆ రోజు పేపర్‌ని తిరగేస్తున్న భర్త రామ్మోహన్‌రెడ్డితో...

"స్టవ్ ఆఫ్ చెయ్యను... ఆ పనేదో నువ్వే చూసుకో" చిరాగ్గా అన్నాడు రామ్మోహన్ పేపర్ మీది నుండి దృష్టిని మళ్ళించకుండానే...

"నన్ను మనమ్మాయి షాపింగ్‌కు రమ్మన్నదండి... ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. అది బిగ్‌బజార్‌లో నాకోసం వెయిట్ చేస్తుంటుంది... నాకోసం కారు కూడా పంపించింది. బయట కార్లో డ్రైవర్ నాకోసం వెయిట్ చేస్తున్నాడు... ఇప్పటికే మంజుల "ఇంకా బయల్దేరలేదా మమ్మీ!" అంటూ మూడుసార్లు ఫోన్ చేసింది... మీరు నాల్గు విజిల్స్ రాగానే స్టవ్ ఆఫ్ చేస్తానంటే నేనిప్పుడే వెళ్ళిపోతాను... అలా ఓ పది నిమిషాలు ముందుగా వెళ్ళినదాన్నవుతాను... ప్లీజ్!" అంది ఊర్మిళ హడావుడిగా డ్రెస్ చేసుకొని, ఆమె పొడవైన జుట్టును ఆర్డర్‌లో పెట్టడానికి ప్రయత్నిస్తూ...

"నాక్కూడా ఓ ముఖ్యమైన పనుంది.. నా మోటార్‌సైకిల్‌ని సర్వీసింగ్ కిచ్చాను... రెండ్రోజులుగా ఆ వర్క్‌షాపువాడు తిప్పుకుంటున్నాడు. మోటారుసైకిల్ లేకపోతే నాకు కాళ్ళుచేతులు విరిగినట్టుగా ఉంటుంది. నేనిప్పుడు ఆ వర్క్‌షాపుకెళ్ళాలి..." అన్నాడతడు పేపర్ను టీపాయ్ మీద పడేసి లోపలకెళ్ళి డ్రెస్ చేసుకుంటూ.

"ఇంత చిన్న పని కూడా చెయ్యరన్నమాట! ఛీఛీ! మిమ్మల్ని నమ్ముకోవడం నాదే తప్పు" అంటూనే ఊర్మిళ వంటగదిలో కెళ్ళింది.

"చిన్నపని... పెద్దపని అని కాదు... ఆడవాళ్ళు చెయ్యాల్సిన పనిని ఆడవాళ్ళే చెయ్యాలి. మగవాళ్ళు చెయ్యాల్సిన పనిని మొగవాళ్ళు చెయ్యాలి. వంట చెయ్యడం నీ డ్యూటీ! బయటి పనుల్ని చెయ్యడం నా డ్యూటీ... ఈ విషయం నీకిదివరకు చాలాసార్లు చెప్పాను..." అన్నాడు రామ్మోహన్.

"మహా చెప్పార్లెండి... ఇవి ఆడవాళ్ళు చెయ్యాల్సిన పనులనీ, ఇవి మగవాళ్ళు చెయ్యాల్సిన పనులని యేదో రాజ్యాంగంలో రాసినట్టు మాట్లాడుతున్నారు... యే పనుల్లోనైనా సరే స్త్రీలు పురుషులు ఒకరికొకరు సహాయం చేసుకుంటే తప్పేముంది?

మీకు వంట పనులన్నీ వచ్చు... చదువుకునే రోజుల్లో మీరే వంట చేసుకున్నారు... ఇప్పుడు కూడా ఎక్కడైనా పార్టీలు జరిగితే మీ ఫ్రెండ్స్ వంట చెయ్యడానికి మిమ్మల్నే తీసుకెళ్తారు... మటన్, చికెన్, బిర్యానీ మీరు బాగా వండుతారని మీ ఫ్రెండ్స్ చెప్పుకుంటారు... వంటల్లో అంత ప్రావీణ్యం సంపాదించిన మీకు కాస్త స్టవ్ ఆఫ్ చెయ్యమంటే చెయ్యనని మొండికేయడం దారుణం" అంది ఊర్మిళ.

"యేవైనా స్పెషల్ అకేషన్స్‌లో నా క్లోజ్ ఫ్రెండ్స్‌కోసం, పిక్నిక్స్ వెళ్ళినప్పుడో పార్టీలు చేసుకున్నప్పుడో వంట చెయ్యమంటే చేస్తాను తప్ప ఇలా ఇంట్లో చెయ్యమంటే చెయ్యను. ఎలాగూ నాకు వంటొచ్చిందని నాతో వంట చేయించాలని నువ్వు చాలాసార్లు ప్రయత్నించావు... కానీ ఇంట్లో వంట చెయ్యటం ఆడవాళ్ళ డ్యూటీ... ఒక్కసారి నేను ఇంట్లో వంట చేశానంటే ఇక ఎప్పుడూ నువ్వు నాతోటే చేయిస్తావని నాకు తెలుసు. అందుకే నేను ఇంట్లో వంట చెయ్యను... వంటేకాదు... ఇంటికి సంబంధించిన యే పని కూడా చెయ్యను. అంట్లుతోమడం, ఇల్లూడ్వటం, బట్టలుతకటం, పిల్లలకి పాలు పట్టటం, స్నానం చేయించటం, వాళ్ళ ముక్కులు శుభ్రం చెయ్యడం లాంటి పనుల్ని నాతో చేయించాలని నువ్వు చాలాసార్లు ప్రయత్నించావు. అలాంటి పనులేవీ నాతో చేయించొద్దని నీకు ఎన్నోసార్లు కచ్చితంగా చెప్పాను" అన్నాడతడు త్వరత్వరగా డ్రెస్ చేసుకొని బయటకు వెళ్ళిపోతూ.

"ఛీఛీ! ఈ మనిషికి పురుషాహంకారం బాగా తలకెక్కింది. ఇతడు మారడు" అనుకుంటూ ఊర్మిళ తన హెయిర్‌ని ఆర్డర్‌లో పెట్టుకోవడం పూర్తి చేసింది. ఈలోగా వంటింట్లోంచి కుక్కర్‌లో విజిల్స్ వస్తున్న చప్పుడైంది. నాల్గు విజిల్స్ రాగానే స్టవ్ ఆఫ్ చేసి "స్వరూపా! నేను బయటకు వెళ్తున్నాను... తలుపులు వేసుకో!" అని కేకేసింది.

లోపల తన రూంలో సీరియస్‌గా చదువుకుంటున్న వాళ్ళ చిన్నమ్మాయి స్వరూప "అలాగే మమ్మీ... నువ్వెళ్ళు..." అంది.

"చదువులో పడి తలుపులు వేసుకోవడం మరచిపోతావేమో... ఇప్పుడే వచ్చి తలుపువేసుకో... అసలే రోజులు బాగా లేవు" అంటూ ఊర్మిళ గేటు తెరచుకొని బయటకొచ్చి తనకోసం వెయిట్ చేస్తున్న కార్లో కూర్చొని "త్వరగా పోనీయ్ రషీద్... అమ్మాయి నాకోసం ఎంత వెయిట్ చేస్తోందో" అంది.

డ్రైవర్ రషీద్ వెంటనే కారు స్టార్ట్‌చేశాడు.

* * * *

ఊర్మిళ రామ్మోహన్లకు ఇద్దరూ కూతుళ్ళే. కొడుకులు లేరు. ఇద్దరు కూతుళ్ళు పుట్టగానే ఇక చాలని రామ్మోహన్ ఊర్మిళకు ట్యుబెక్టమీ ఆపరేషన్ చేయించాడు.

రామ్మోహన్ బి.ఏ. పూర్తిచేసి ఎల్.ఎల్.బీ. చదివాడు కానీ పూర్తిచెయ్యలేదు. తండ్రి సంపాదించిపోయిన బోల్డు ఆస్తి ఉంది. వాళ్ళ స్వంతూరు హైదరాబాదుకు చాలా దగ్గర్లోనే ఉంటుంది. అక్కడ తండ్రి సంపాదించిన 20 ఎకరాల మాగాణి మరో ఇరవై ఎకరాల మెట్టభూమి, పెద్ద మామిడితోట, బత్తాయి తోట ఉన్నాయి. రామ్మోహన్‌రెడ్డి తండ్రి పోయాక తండ్రి ద్వారా సంక్రమించిన ఈ ఆస్తిమీదనే ఆధారపడి బతుకుతున్నాడు. వాళ్ళ ఊర్లో వాళ్ళకో పెద్ద బిల్డింగ్ కూడా ఉంది. తనకున్న ఇద్దరు కూతుళ్ళను చదివించటం కోసం ఊర్నించి మకాంని హైదరాబాద్ నగరానికి మార్చాడు.

రామ్మోహన్‌రెడ్డి విలాస పురుషుడు. అతనికి చాలామంది ఫ్రెండ్స్ ఉన్నారు. అందరికీ నగరంలో ఉన్న పేరుమోసిన క్లబ్బుల్లో మెంబర్‌షిప్ ఉంది. ఫ్రెండ్స్‌తో కలిసి పేకాడటం, పార్టీలు చేసుకోవడం, అప్పుడప్పుడు పిక్నిక్‌లకు వెళ్ళడంలాంటి వ్యాపకాలంటే రామ్మోహన్‌కు చాలా ఇష్టం. ఓపక్క ఊర్లో ఉన్న వ్యవసాయం చేసుకుంటూ మరో పక్క సిటీలైఫ్‌ను ఎంజాయ్ చెయ్యడం అతనికి బాగా అలవాటైపోయాయి.

చిన్ననాటి నుండి అతనికి కొన్ని రకాల వంటలు చెయ్యడం మీద చాలా ఇంటరెస్ట్ యేర్పడింది. మటన్, చికెన్, ఫిష్, బిర్యానీ లాంటి వంటల్ని అతడు చాలా బాగా చేస్తాడనీ, అతనిది నలభీమ పాకమని అతని ఫ్రెండ్స్ చెప్పుకుంటారు. కొన్నిసార్లు రామ్మోహన్ తన ఫ్రెండ్స్‌ని వాళ్ళూరికి తీసికెళ్ళి వాళ్ళింట్లోనే పార్టీలు అరేంజ్ చేస్తుంటాడు. తన ఫ్రెండ్స్‌కిష్టమైన వంటల్ని అతడే స్వయంగా వండుతుంటాడు. ఎప్పుడూ ఫ్రెండ్స్‌తో సరదాగా గడపటం అతనికి చాలా ఇష్టమైన వ్యాపకం. వంట్లో ఇంత ప్రావీణ్యాన్ని సంపాదించిన రామ్మోహన్ ఇంట్లో మాత్రం వంటల విషయంలో అతని భార్య ఊర్మిళకెప్పుడూ సహాయం చెయ్యడు.

వాళ్ళ ఇద్దరు కూతుళ్ళలో పెద్దకూతురు మంజుల బి.టెక్. ప్యాసయింది. ఆమెను అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న అరవిందరెడ్డికిచ్చి రెండు నెలల క్రితమే పెళ్ళిచేశారు. రెండో కూతురు స్వరూప బీ.టెక్ ఫైనలియర్ చదువుతోంది. రామ్మోహన్‌కు తన కూతుళ్ళంటే విపరీతమైన ప్రేమ. ఇద్దర్నీ బాగా చదివించాలని, అమెరికాలో పెద్దపెద్ద సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళకిచ్చి పెళ్ళిళ్ళు చెయ్యాలని కలలుగంటుండేవాడు.

రామ్మోహన్‌వాళ్ళ బంధువుల పిల్లలందరూ అమెరికాలోనే ఉద్యోగాలు చేస్తున్నారు. తమ బంధువుల్లో ఎవరైనా తమ పిల్లల్ని అమెరికాకు పంపించకపోతే దాన్ని చాలా చిన్నతనంగా, చేతగాని తనంగా చూస్తుంటారు. తనకలాంటి పరిస్థితి రాకూడదు. తన ఇద్దరి కూతుళ్ళకూ అమెరికా సంబంధాలే తీసుకురావాలి... తన కూతుళ్ళు కూడా తనకు కాబోయే అల్లుళ్ళతో పాటు అమెరికాలో ఉద్యోగాలు చెయ్యాలి. ఈ లక్ష్యంతోటే రామ్మోహన్ తన ఇద్దరు కూతుళ్ళను పెద్దపెద్ద డొనేషన్లు కట్టి కార్పొరేట్ కాలేజీల్లో బీ.టెక్ చదివించాడు.

మంజుల బి.టెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ కోర్సుని చాలా మంచిమార్కులతో ప్యాసయ్యింది. వెంటనే మంజులకు ఓ అమెరికా సంబంధం కూడా కుదిరింది.

అబ్బాయి అరవింద్‌రెడ్డి కాలిఫోర్నియాలోని సిలికాన్‌వేలీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అతడు రామ్మోహన్ వాళ్ళ బంధువులబ్బాయే. రామ్మోహన్ వాళ్ళ అక్కా బావలు అమెరికాలోనే ఉంటున్నారు. వాళ్ళ ద్వారానే ఈ సంబంధం కుదిరింది. మంజుల చూడటానికి చాలా అందంగా ఉంటుంది. బి.టెక్. ఫస్ట్‌క్లాసులో ప్యాసయ్యింది. అమెరికాలో కూడా ఆమెకు అరవింద్ పనిచేస్తున్న కంపెనీలోనే ఉద్యోగం కూడా దొరికే అవకాశం ఉందని తెలియడంతో ఈ సంబంధం చాలా సులభంగానే కుదిరింది. రెండు నెలల క్రితమే చాలా గ్రాండ్‌గా వాళ్ళ పెళ్ళి జరిగింది. అరవింద్ పెళ్ళయిన వెంటనే అమెరికాకు వెళ్ళిపోయాడు.

ఇప్పుడు మంజుల కూడా అమెరికా వెళ్ళాలి. ఆమె అమెరికాకు రావడానికి కావలసిన పేపర్స్‌ని, టికెట్స్‌ని అరవింద్ పంపించేశాడు. ఇంకో నాల్గు రోజుల్లో మంజులను అమెరికాకు పంపించాలి. అందుకే ఈ వారం రోజుల నుండి మంజుల ప్రతిరోజూ షాపింగ్‌కు వెళ్తోంది. ఆమె షాపింగ్ చేస్తున్నప్పుడు వాళ్ళ అమ్మ ఆమెతో ఉండాలి. అమ్మ పక్కన లేకుండా మంజుల యేపనీ చెయ్యదు. మంజుల అత్తమామలు కూడా హైదరాబాద్‌లోనే ఉంటారు. మంజుల వాళ్ళ అత్తమామల ఇంట్లోనే ఉంటూ షాపింగ్‌కు వెళ్ళేటప్పుడు వాళ్ళ అమ్మకోసం కారు పంపిస్తుంటుంది.

మంజుల అమెరికాకు వెళ్ళిపోతున్నదని తెలిసినప్పట్నించి ఊర్మిళకు కంటిమీద కునుకు లేదు. చాలా ఆర్భాటం, చాలా హడావుడి చేస్తోంది. క్షణం తీరిక లేకుండా మంజుల చుట్టే తిరుగుతోంది. ఆ హడావుడిలో పడిపోయి ఇంటిపనులన్నీ తనతో చేయించాలని ప్రయత్నిస్తోంది. అదే తనకు నచ్చటం లేదు. ఎంత బిజీగా ఉంటే మాత్రం వంటింటి పనులు తనను చెయ్యమంటుందా? స్వరూపకు చదువు

తప్ప మరో ప్రపంచమే లేదు. ఊర్మిళ చేసిన పెద్ద పొరపాటేమిటంటే తన ఇద్దరి బిడ్డలకూ్కడా వంట పనులు నేర్పించకపోవటం! వాళ్ళకు చదువు తప్ప మరో వ్యాపకం అంటూ లేకుండా చేసింది. వాళ్ళతో ఎప్పుడూ "చదవండి... చదవండి... ఈ టెస్టులొస్తున్నాయి... ఆ టెస్టులొస్తున్నాయి.. ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకోవాల"ని పోరాడిందే తప్ప ఒక ఏజ్ వచ్చాక ఆడపిల్లలు నేర్చుకోవాల్సిన పనులేవీ వాళ్ళకు నేర్పించలేదు.

ఈ విషయంలో తను ఊర్మిళతో చాలాసార్లు పోరాడాడు. "వాళ్ళకు వంటపనులు నేర్పించూ, రేపు పెళ్ళయ్యాక చేసుకున్న వాడికి కనీసం వంటయినా చేసిపెట్టకపోతే ఎలా?" అన్నాడు ఎన్నోసార్లు.

"వాళ్ళకు చదువుమీద తప్ప మరిదేనిమీద ఇంటరెస్ట్ లేదు... అయినా వంట నేర్పించూ... వంట నేర్పించూ అని నాకు చెబుతారెందుకూ? మీకూ వంటొచ్చుకదా! మీ ముద్దుల కూతుళ్ళకి మీరే వంట నేర్పించవచ్చు కదా!" అంది ఊర్మిళ.

"నీకేమైనా బుద్ధుందా? చెట్టంత ఆడదానివి నువ్వుండగా నన్ను వాళ్ళకు వంట నేర్పించమంటావా?" అన్నాడు తను.

కూతుళ్ళంటే తనకూ ఎంతో ప్రేముంది. కానీ వాళ్ళిద్దరూ ఆడవాళ్ళలా కాకుండా మగవాళ్ళలా తయారవ్వడం తనకు బొత్తిగా నచ్చలేదు.

* * * *

ఆరోజు మంజుల అమెరికాకు వెళ్ళిపోతుంది. రెండు భారీ సూటుకేసుల్లో సామాన్లన్నీ సర్దుకొని అందరూ రెండు కార్లలో షంషాబాద్ విమానాశ్రయానికి వెళ్ళి మంజులను అమెరికాకు వెళ్ళే విమానం ఎక్కించారు.

తను క్షేమంగా చేరుకున్నానని, సానిఫ్రాన్సిస్కో విమానాశ్రయానికి అరవింద్ వచ్చి తనను రిసీవ్ చేసుకున్నాడని మంజుల ఫోన్ చేసింది.

* * * *

మంజుల అమెరికాకు వెళ్ళాక ఒక సంవత్సరం గడిచిపోయింది.

ఈలోగా స్వరూప కూడా బి.టెక్ పూర్తిచేసింది. ఆమెకు కూడా ఓ అమెరికా సంబంధమే కుదిరింది. స్వరూప భర్త అన్వేష్ చికాగో నగరంలో ఓ పెద్ద కార్పొరేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. స్వరూప పెళ్ళి కూడా రామ్మోహన్ వాళ్ళ అక్కాబావల ద్వారానే కుదిరింది.

పెళ్ళాయ్యాక స్వరూప కూడా అమెరికాకు వెళ్ళిపోయింది.

మా ఇద్దరు కూతుళ్ళూ అమెరికాలో ఉంటున్నారని, మా అల్లుళ్ళు అక్కడి హైలీ రెప్యూటెడ్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారని రామ్మోహన్ తన మిత్రులతో చాలా గర్వంగా చెప్పుకునేవాడు. ఇద్దరి కూతుళ్ళ పెళ్ళయ్యాక తన మిత్రులందర్నీ తన ఊరికి తీసికెళ్ళి రామ్మోహన్ ఓ గ్రాండ్ పార్టీ అరేంజ్ చేశాడు.

"నువ్వు అనుకున్నది సాధించావోయ్" అంటూ అతని మిత్రులందరూ అతన్ని అభినందించారు.

మరో ఆరునెలలు గడిచాయి.

మంజుల తాను గర్భవతినయ్యాననీ, ఇంట్లో యేపనిని చేసుకోలేక పోతున్నానని, వెంటనే అమ్మా, నాన్న - ఇద్దరూ అమెరికాకొచ్చి తను డెలివరీ అయ్యేంత వరకుండాలని ఫోన్ చేసింది.

మంజుల గర్భవతి అయ్యిందని తెలియగానే ఊర్మిళ, రామ్మోహన్లు ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోయారు. తాను అమ్మమ్మ నవుతున్నానని ఊర్మిళ, తాను తాతయ్య నవుతున్నానని రామ్మోహన్ సంభ్రమాశ్చర్యాలతో ఉబ్బితబ్బిబ్బయిపోయారు.

త్వరలోనే తాము అమెరికాకు వెళ్ళబోతున్నామన్న ఆలోచన కూడా వాళ్ళను ఆనందంలో ముంచెత్తింది.

అమెరికాకు రావడానికి కావలసిన పేపర్స్ అన్నింటినీ అరవింద్ పంపించాడు. ప్యాసుపోర్టు, వీసా మొదలయినవన్నీ వచ్చేసాయి. అరవింద్ ఫ్లైట్ టికెట్స్ కూడా పంపించాడు.

అమెరికాకు వెళ్ళొచ్చిన వాళ్ళ బంధువుల మేం "న్యూయార్కు చూశాం. నయాగరా ఫాల్స్ చూశాం.... చికాగో చూశాం... లాస్‌ఏంజెల్స్ చూశాం... డిస్నీల్యాండ్ చూశాం... అదో అద్భుత ప్రపంచం. అదో భూతల స్వర్గం" అని చెప్పినప్పుడు ఆ ప్రపంచాన్ని మేమెప్పుడు చూస్తామా అని రామ్మోహన్, ఊర్మిళ ఉవ్విళ్ళూరుతుండేవాళ్ళు. ఇప్పుడు మాకూ ఆ అవకాశం వచ్చిందని వాళ్ళెంతో సంతోషించారు. వెళ్ళడానికింకా నెలరోజుల టైముండగానే అమెరికాకు వెళ్ళడానికి రకరకాల ఫలహారాల్ని, పిండి వంటల్ని తయారు చేసుకోసాగారు.

రామ్మోహన్‌ది చాలా పెద్ద వ్యవసాయం. రకరకాల పంటలు పండిస్తూ ఆదర్శరైతుగా అతనికా ఊర్లో గుర్తింపు ఉంది. తను అమెరికాకు వెళ్తున్నానని, వ్యవసాయప్పనులన్నింటినీ తన దగ్గర పాలేరుగా పనిచేస్తున్న వీరాస్వామికి

అప్పగించాడు. "త్వరగా వచ్చెయ్యండి సార్! లేకపోతే మీ వ్యవసాయం దెబ్బతింటుంది. మీరు లేందే నేనేం చెయ్యగలను" అన్నాడు వీరస్వామి.

"మూడు నెలల్లో వచ్చేస్తాను... జాగ్రత్త" అన్నాడు రామ్మోహన్.

మంజుల ఇంకో నెలరోజులకు ప్రసూతి అవుతుందనగా ఊర్మిళ, రామ్మోహన్లు అమెరికాలోని వాళ్ళ పెద్దకూతురు, పెద్దల్లుని ఇంటికి చేరుకున్నారు.

అమెరికాలోని రోడ్లను, 60, 70 అంతస్తుల బిల్డింగులను చూశాక అమెరికా నిజంగా భూతలస్వర్గమే అనుకున్నాడు రామ్మోహన్.

వాళ్ళ అల్లుడు, కూతురు ఉంటున్న ఇల్లు కూడా అద్భుతంగా ఉంది. ఈ మధ్యనే వాళ్ళా ఇంటిని కొనుక్కున్నారట. అది రెండంతస్తుల మేడ. నాల్గు బెడ్‌రూములు... పెద్ద హాలు... పెద్ద వంటగది... దానిపక్కనే డైనింగ్ హాలు... కళ్ళు మిరుమిట్లు గొలిపే ఫర్నిచర్... ప్రతి బెడ్‌రూంకు అటాచ్డ్ రెస్ట్‌రూమ్స్.... కార్పెట్‌తో కప్పబడిన ఫ్లోరింగ్... ఇంటి ముందు పచ్చటి గడ్డితో లాన్... ఇంటివెనుక మంచి గార్డెన్... విశాలమైన కాంపౌండ్... సినిమాహాల్లో ఉన్నంత స్క్రీన్‌తో ఎల్.సి.డీ.... చుట్టుపక్కలున్న ఇళ్ళన్నీ అలాగే విశాలంగా ఉన్నాయి.

ఇక్కడ దేనికీ కొదవలేదనిపించింది. నీళ్ళు, కుకింగ్ గ్యాసు, ఎలక్ట్రిసిటీ, వంట పదార్థాలు – అన్నీ పుష్కలంగా లభిస్తాయని అర్థమైంది.

ప్రయాణం బాగా జరిగిందా? ఎక్కడా ఇబ్బంది కాలేదు కదా" అంది వాళ్ళమ్మాయి మంజుల.

"బావున్నారా మామగారూ, ప్రయాణం హాయిగా సాగిందా?" అన్నాడు వాళ్ళ అల్లుడు అరవింద్.

"ఎప్పుడూ వ్యవసాయం... వ్యవసాయం అని తిరుగుతుంటారు. అన్నీ మరచిపోయి ఇక్కడ ఓ ఆర్నెల్లపాటు హాయిగా ఉండిపొండి మామగారూ!" అన్నాడు అరవింద్.

"ఆరు నెలలంటే ఇంకేమన్న ఉందా? మూడు నెల్లు ఉండి వెళ్తాంలెండి అల్లుడుగారూ" అన్నాడు రామ్మోహన్.

"చూద్దాం లెండి. రావడం వరకే మీ వంతు. మిమ్మల్ని పంపించడం మావంతు" అన్నాడు అరవింద్.

వాళ్ళొచ్చిన మర్నాడే మంజులను చెకప్ కోసం హాస్పిటల్‌కు తీసికెళ్ళాలన్నాడు అరవింద్.

"ఇక్కడ ఎక్కిడికెళ్ళాలన్నా చాలా దూరాలు నాన్నగారూ! వేం తిరిగొచ్చేటప్పటికి నాల్గు గంటలైనా అవుతుంది. అమ్మను కూడా నాతో తీసికెళ్తున్నాను. వేం వచ్చేంతవరకు ఇంటిని మీరే చూసుకోవాలి... మీకోసారి మా కిచెన్ చూపిస్తారండి... మీకు వంటచెయ్యడం వచ్చుకదా..." అంటూ మంజుల రామ్మోహన్‌ను వంటగదికి తీసికెళ్ళింది.

"వంట చెయ్యడమేమిటి? ఆయనకు రానిపనంటూ యేదన్న ఉందను కుంటున్నారా? ఆయనకు అన్నిపనులూ వచ్చు..." అంది ఊర్మిళ.

"ఇక్కడ వంటచెయ్యడం చాలా సులభం మామగారు. మంజుల ప్రెగ్నెంటయి నప్పట్నించి వంటంతా నేనే చేస్తున్నాను... ఇప్పుడు మీరొచ్చారుకదా... నామీది బర్డెన్‌ను మీరు తొలగించాలి మామగారు" అన్నాడు అరవింద్.

"అంటే... అంటే నేను వంట చెయ్యాలా?" అన్నాడు రామ్మోహన్ చాలా కంగారుగా.

"అవును మామగారూ! మా కిఛెన్ను మీకే హాండోవర్ చేస్తాం... కిఛెనే కాదు... మొత్తం మా ఇంటినే మీకు హాండోవర్ చేస్తాం... అన్నీ మీరే చూసుకోవాలి. అత్తగారికేమో మంజులతోటే సరిపోతుంది... ఇక్కడ వంట చెయ్యడం గానీ, ఇంటిని శుభ్రం చేసుకోవడం గానీ చాలా సులభం మామగారూ! అన్నింటికీ మెషీన్స్ ఉన్నాయి. వాటినెలా హ్యాండిల్ చెయ్యాలో మేం మీకు చూపిస్తాం" అన్నాడు అరవింద్.

"మీ మామగార్కి ఇంట్లో వంటపనులు చెయ్యడం నచ్చదు అల్లుడు గారూ! ఆడవాళ్ళు చెయ్యాల్సిన పనులు ఆడవాళ్ళే చెయ్యాలి. మగవాళ్ళు చెయ్యాల్సిన పనులు మగవాళ్ళు చెయ్యాలే అంటుంటారు. ఇంటి పనులన్నీ ఆడవాళ్ళే చెయ్యాలట... వంటపనిలో కాస్త సహాయం చెయ్యండి అని నేనెన్నిసార్లు ప్రార్థించినా ఇక్కడున్న వస్తువును అక్కడ పెట్టడు... మగవాళ్ళు వంటపని చేస్తే చాలా చులకనైపోతారట..." అంది ఊర్మిళ.

ఆమె అన్న ఆ మాట వినగానే అరవింద్ పెద్దగా నవ్వాడు. "ఈ పనులు ఆడవాళ్ళు మాత్రమే చెయ్యాలి... ఈ పనులు మగవాళ్ళు మాత్రమే చెయ్యాలన్న ఒకప్పటి నియమానికి కాలం చెల్లిపోయింది మామగారూ! అది ఫ్యూడల్ సంప్రదాయం. ఇండియాలో ఫ్యూడల్ భావజాలం ఇంకా బలంగా ఉన్నట్టుంది. అందుకే వంటపనులు మగవాళ్ళు చేస్తే నామోషి అని మీరను కుంటున్నట్టుంది. ఇక్కడ అమెరికాలో ఆ పరిస్థితి ఎప్పుడో మారిపోయింది. ఇక్కడ స్త్రీలు, పురుషులు అన్న తేడా లేకుండా

అన్ని పనులు అందరం చేసుకుంటాం... మనం ఎక్కడుంటే అక్కడి పరిస్థితులకు అనుగుణంగా మారాలి మామగారూ! మీరు రోమ్‌లో ఉంటే రోమన్‌లా మారాలి అన్న సామెతను మీరు వినే ఉంటారు. రండి. మీకోసారి మా కిచెన్‌ను చూపిస్తాను" అంటూ అరవింద్ రామ్మోహన్‌ను వాళ్ళ వంటగదిలోకి తీసికెళ్ళి అక్కడున్న గాడ్జెట్స్‌నన్నింటినీ రామ్మోహన్‌కు చూపించాడు. వాటిల్లో చాలావాటిని రామ్మోహన్ ఇదివరకే హ్యాండిల్ చేశాడు కాబట్టి అన్నీ అతనికి సులభంగానే అర్థమయ్యాయి.

"మేం వచ్చేటప్పటికి అన్నం వండేసెయ్యండి నాన్నగారు. కూరగాయలు ఫ్రిజ్‌లో ఉన్నాయి... మీ అల్లుడుగార్కి ఎగ్‌కర్రీ అంటే చాలా ఇష్టం... అన్నం వండి ఎగ్ కర్రీ చేయండి. గంటసేపట్లో వంటయిపోతుంది... తర్వాత హాయిగా టీ.వీ. చూస్తూ కూర్చోండి. ఇక్కడ కూడా మన తెలుగు ఛానెల్స్ వస్తాయి...' అంటూ మంజుల గోడకున్న 35 ఎం.ఎం. అంతున్న ఎల్.సీడీని చూపించి దాన్ని ఎలా పెట్టుకోవాలో రిమోట్‌కంట్రోల్ ద్వారా చూపించింది.

దేన్నయినా చాలా త్వరగా గ్రహించే రామ్మోహన్‌కు అక్కడి వంటగదిలో ఉన్న గాడ్జెట్స్, హాల్లో ఉన్న ఎక్విప్‌మెంట్, ఎల్.సీడీ మొదలైనవాటిని ఎలా వాడుకోవాలో అర్థమైపోయాయి.

అరవింద్, మంజుల, ఊర్మిళలు తయారై సాయంత్రం ఆరవుతుండగా బయట్నించి ఇంటికి తాళం వేసేసి గరాజ్‌లో ఉన్న కారును బయటకు తీశారు.

"బయట్నించి లాక్ చేసుకొని వెళ్తున్నాం నాన్నా... మీకేం భయం లేదు. యేదన్నా అవసరం ఉంటే మాకు ఫోన్ చెయ్యండి..." అంది మంజుల.

"అలాగే" అన్నాడు రామ్మోహన్.

వాళ్ళు కారు స్టార్ చేసుకొని వెళ్ళిపోయారు.

పుష్పకవిమానంలా వెళ్ళిపోతున్న ఆ పెద్ద కారుకేసి కిటికీలోంచి చూస్తూ రామ్మోహన్ హాల్లో ఉన్న సోఫాలో గాఢంగా నిట్టూర్చి కూలబడిపోయాడు.

యేం జరుగుతున్నదో అతనికర్థం కాలేదు. బయట్నించి తాళం వేసుకొని వెళ్తున్నారంటే అతనికి తననో జైల్లో బంధించి వెళ్తున్నట్టుగా తోచింది. తనింత దూరం వీళ్ళకు వంటచేసి పెట్టడానికొచ్చాడా? వంటపనే కాదు... ఇంటి పనంతా చేసి పెట్టాలంటున్నాడు తన అల్లుడు. ఇంత బతుకు బతికి తను వీళ్ళకు వంటవాడిగా, పనివాడిగా మారిపోవాలా? అతనికి వెంటనే ఆ ఇంట్లోంచి బయటకు వెళ్ళిపోయి తన దేశానికి, తన ఊరికి వెళ్ళిపోవాలనిపించింది. కానీ అది సాధ్యమయ్యే పని

కాదనిపించింది. కాస్సేపలా దీర్ఘంగా ఆలోచించాక అతనికి వాళ్ళమ్మాయి చెప్పిన పనులు గుర్తొచ్చాయి. అయిష్టంగానే అతడు వంటగదిలో ప్రవేశించి వంటపని చెయ్యడం ప్రారంభించాడు.

ఓ గంటసేపట్లోనే పని ముగించుకొని టీ.వీ. చూస్తూ కూర్చున్నాడు. కాస్సేపట్లోనే అతనికి నిద్ర పట్టేసింది. సోఫాలోనే పడుకొని నిద్రపోయాడు.

రాత్రి తొమ్మిదవుతుండగా వాళ్ళొచ్చి అతన్ని నిద్రలేపారు.

"వంటలు చాలా బావున్నాయి మామగారూ?" అన్నాడు అరవింద్ అందరూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చొని భోజనం చేస్తున్నప్పుడు. "మీరు చికెన్, మటన్లు కూడా బాగా చేస్తారట. నాకు చికెన్‌బిర్యానంటే చాలా ఇష్టం. రేపు చేసిపెట్టండి. చికెన్ తెస్తాను" అన్నాడు అరవింద్.

రామ్మోహన్‌కు నవ్వాలో, యేడ్వాలో అర్థం కాలేదు. మంజుల ప్రెగ్నెన్సీ విషయంలో యేవో కాంప్లికేషన్స్ ఉన్నాయని, వెంటనే హాస్పిటల్లో జాయిన్ చేయించి డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచాలని హాస్పిటల్ వాళ్ళు చెప్పారట.

రెండ్రోజుల తర్వాత మంజులను హాస్పిటల్లో జాయిన్ చేయించటానికి తీసికెళ్ళారు. రామ్మోహన్ను ఇంట్లోనే ఉండమన్నారు. బయట్నించి తాళం వేసి ఇంట్లో యేమేం పనులు చెయ్యాలో చెప్పి వాళ్ళు వెళ్ళిపోయారు.

అంతే! అప్పట్నించి రామ్మోహన్‌కు ప్రతి రోజూ ఇలాగే గడిచింది. హాస్పిటల్లో ఊర్మిళ అనుక్షణం మంజులతోటే ఉంటోంది. అరవింద్ ఉదయం లేచి త్వరత్వరగా తయారై బ్రేక్‌ఫాస్ట్ చేసి ఆఫీసుకు వెళ్ళిపోతున్నాడు. ఇంటి భారమంతా రామ్మోహన్ మీదనే పడింది.

జైలు జీవితమంటే ఎలా ఉంటుందో రామమోహన్‌కు అర్థమైంది. ఈ జైల్లోంచి ఎలా బయటపడాలో అతనికి అర్థం కాలేదు. వంట చేయడంతోపాటు ఐదారు రోజులకొకసారి వాక్యూమ్ క్లీనర్‌తో ఇంటిని శుభ్రం చేయడం... వాషింగ్ మెషీన్‌తో బట్టలుతకటం... ఇంటి ముందున్న లాన్‌ను కట్టింగ్ మెషీన్‌తో కట్‌చెయ్యడం, ఇంటెనుక ఉన్న గార్డెన్‌లో పనిచెయ్యడంలాంటి పనులన్నీ చెయ్యడానికి రామ్మోహన్ అలవాటు పడిపోయాడు.

వచ్చి నెల దాటినా అమెరికాలోని బయటి ప్రపంచం ఎలా ఉంటుందో అతడు చూడనేలేదు. శని, ఆదివారాలొచ్చినప్పుడు అరవింద్ ఇంట్లో ఉన్నప్పుడు బయటకు ఎక్కడికైనా తీసికెళ్తాడేమో అనుకుంటే అతడా విషయాన్ని పట్టించుకున్నట్టు కనిపించనేలేదు. ఎప్పుడు చూసినా ల్యాప్‌ట్యాప్ ముందేసుకొని కూర్చునేవాడు.

ఒకటి రెండు సార్లు హాస్పిటల్‌కు మాత్రం తీసికెళ్ళాడు.

హాస్పిటల్‌లో జాయినయిన 20 రోజుల తర్వాత మంజుల ప్రసూతయ్యింది. కొడుకు పుట్టాడు. అమెరికాలో ఎక్కువగా సిజేరియన్ ఆపరేషన్ అవసరం లేకుండానే సహజమైన డెలివరీలే అవుతాయట. కానీ మంజులకు మాత్రం సిజేరియన్ అవసరమయ్యింది. దాంతో ఆమెను పదిరోజులదాకా హాస్పిటల్ నుండి డిస్చార్జ్ చెయ్యలేదు.

హాస్పిటల్ నుండి డిస్చార్జ్ చేశాకనైనా తన బాధలు తీర్తాయేమో అనుకున్నాడు రామ్మోహన్. కానీ అదీ జరగలేదు.

ఊర్మిళ ఎప్పుడూ మంజుల దగ్గరే ఉండిపోతూ వంటగదిలోకి ప్రవేశించేదే కాదు. రాత్రిపూట తను పడుకున్న గదిలోకి కూడా వచ్చేదికాదు.

"నేనీ వంటపని, ఇంటిపని చెయ్యలేను. నేను ఇండియాకెళ్ళిపోతాను. నేనీ బానిస పని చెయ్యలేను. ఈ జైలు జీవితం అనుభవించలేను" అన్నాడు రామ్మోహన్ ఊర్మిళతో.

"కన్నకూతురికోసం మీకు బాగా వచ్చిన పని చేస్తే అది బానిసత్వం అవుతుందా? కన్నకూతురింట్లో ఉండటం జైలు జీవితమా? యేం మాట్లాడుతున్నారండీ... ఇంకో రెన్నెల్లుంటే మంజుల తన పనులు తను చేసుకోగల్గుతుంది. అంతవరకు ఓపిక పట్టండి" అంది ఊర్మిళ, చాలా కోపంగా.

"నాకంత ఓపిక లేదు. కావాలంటే నువ్వుండిపో... నేను వెళ్ళిపోతాను... అరవింద్‌తో చెప్పి నా రిటర్న్ జర్నీ టికెట్ డేట్‌ను మార్పించమంటాను" అన్నాడు రామ్మోహన్, అంతే కోపంగా.

"అక్కడ యేం మునిగిపోతున్నదని మీరు వెళ్ళిపోతానంటున్నారు... మీ ఫ్రెండ్స్‌తో పార్టీలు చేసుకొని తాగి తందనాలాడలేక పోతున్నాననా వెళ్తానంటున్నారు" అంది ఊర్మిళ.

"పిచ్చిగా వాగకు ఊర్మిళా! నేనిక్కడుండలేను... ఇలాగే ఈ జైలులో ఇంకో పదిరోజులుంటే నాకు పిచ్చెక్కుతుంది. ప్లీజ్... నన్నర్థం చేసుకో" అరచినట్టుగా అన్నాడు రామ్మోహన్.

"యేమిటి నాన్న! అమ్మతో యేదో గొడవ పడ్తున్నట్టున్నారు" అంటూ అక్కడికి మంజుల వచ్చేసింది.

"మీ నాన్న ఇండియాకు వెళ్ళిపోతానంటున్నాడు" అంది ఊర్మిళ.

"అదేమిటి నాన్నా! ఇక్కడ మీకేం కష్టమౌతోంది? మీకు వంట చెయ్యడం కష్టంగా ఉంటే అమ్మే చేస్తుందిలెండి. నేను మామూలు మనిషినైపోయి నా జాబ్‌లో జాయినయ్యేంతవరకు మీరిద్దరు ఇక్కడ ఉండాలి... కన్నకూతురి కోసం మీరీ మాత్రం చెయ్యలేరా? మీరిక్కడకు రావడం కోసం మేం లక్షరూపాయలు ఖర్చుచేశాం... ఎందుకు? డెలివరీ టైమ్‌లో మాక్కొంచం సహాయంగా ఉంటారనే కదా!" అంది మంజుల నిష్ఠూరంగా.

కూతురలా మాట్లాడేటప్పటికి రామ్మోహన్ చాలా చలించిపోయాడు. ఆమెను బాధపెట్టానేమో అనుకొని నిశ్శబ్దంగా మారిపోయాడు.

"ఇంకో మూడు నెలల దాకా మీ నోటినుంచి ఇండియా వెళ్ళిపోతానన్న మాట రాకూడదు నాన్నా... ప్లీజ్... నా ఆరోగ్యం కాస్త కుదుట పడగానే మిమ్మల్ని న్యూయార్క్‌కు, నయాగరా ఫాల్స్‌కు తీసికెళ్ళాలనుకుంటున్నాం..." అంది మంజుల.

"న్యూయార్క్ నగరాన్ని, నయాగరా ఫాల్స్‌నీ, డిస్నీల్యాండ్‌ను చూడాలని ఎన్నాళ్ళుగానో కలలుగంటున్నాను" అని రామ్మోహన్ ఇంకేదో చెప్పబోతుండగానే

"కొంచెం ఓపికపడ్తే మీ కలల్ని నిజం చేస్తాం నాన్న! మీ అల్లుడుగారు కూడా వాళ్ళకు ఇక్కడికొచ్చినప్పట్నించి యేమీ చూపించలేకపోయామని చాలా బాధపడ్డారు" అంది మంజుల.

ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయింది.

ఆ మర్నాడు ఆఫీసుకు వెళ్తూ అరవింద్

"మామయ్యగారూ! మీరు ఇండియాకు వెళ్ళిపోతానన్నారట... ఇండియా వెళ్ళి యేం చేస్తారు?" అన్నాడు.

"యేం చెయ్యడమేమిటి? అక్కడ నా వ్యవసాయం యేమైపోతున్నదోనని బాధగా ఉంది. ఇంకా వేరే పనులు కూడా చాలా ఉన్నాయి" అన్నాడు రామ్మోహన్ కొంచెం తడబడ్తూ.

"ఫ్రెండ్స్‌తో తిరగటం, క్లబ్బుల్లో పేకాడటం తప్ప మీకు వేరే పనులేమున్నాయండి" అంది ఊర్మిళ.

"మీకు వ్యవసాయంలో నష్టమొస్తే ఆ నష్టాన్ని నేను సర్దుతానులెండి. మీరిక్కడుండటం మాకు చాలా అవసరం... ఇక్కడ ఇండియాలోలాగా పనిమనుషులెవరూ దొరకరు... ఒకవేళ దొరికినా వాళ్ళకు మా ఇద్దరికొచ్చే జీతంలో ఒక జీతం మొత్తం వాళ్ళకివ్వాలి... ఇండియాలో మీరేం పెద్ద ఉద్యోగం చెయ్యడం

లేదుగా... వ్యవసాయమే కదా మీరు చేసేది... ఆ వ్యవసాయంలో మీరు సంపాదించేది యేముంటుంది? పీనట్స్... ఆ మాత్రం నేను మీకిస్తాలెండి" అన్నాడు అరవింద్ చాలా నిర్లక్ష్యంగా.

"ఆయన మాటల్ని మీరు సీరియస్‌గా తీసుకోకండి అల్లుడుగారు... మీరన్నమాట చాలా నిజం. ఆయన వ్యవసాయం చేసి సంపాదిస్తున్నదేమీ లేదు. పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు... ఇక్కడ మాకు హాయిగా ఉంది... మీరు ఉండమన్నన్ని రోజులుంటాం. మీరేం వర్రీ కాకండి అల్లుడుగారు" అంది ఊర్మిళ.

''థాంక్యూ ఆంటీ! థాంక్యూ సోమచ్'' అంటూ అరవింద్ ఆఫీసుకెళ్ళిపోయాడు.

"నువ్వు హాయిగానే ఉన్నావు... కానీ నేను హాయిగా లేను ఊర్మిళ గారూ! నాకు పిచ్చెత్తినట్టుగా ఉంది" అన్నాడు రామ్మోహన్.

"ఎందుకు పిచ్చెత్తినట్టుగా ఉంది. తిన్నది అరగకనా?" అంది ఊర్మిళ.

"అవును! తిన్నది అరగకనే. నీకు నీ కూతురితో, మనవడితో బాగానే గడిచిపోతున్నది... ఒంటరితనంతో నేను చచ్చిపోతున్నాను... ఒక్కసారన్న రాత్రి గానీ, పగలుగానీ నువ్వు నా గదికొస్తున్నావా? ఒంటరితనంతో నేనెంత క్షోభను అనుభవిస్తున్నానో అర్థం చేసుకుంటున్నావా? యూ ఆర్ ఎ డెవిల్... నీకు భర్త అనేవాడు అక్కర్లేదు. వాడు నీ దృష్టిలో ఓ సేవకుడు. నీకు, నీ కూతురికి, నీ అల్లుడికి పనులన్నీ చేసిపెట్టే ఓ నౌకర్‌గాడు... ఛీఛీ! నా బతుకు మీద నాకసహ్యం పుడ్తోంది. ఇంతకాలం నా భార్య, నా కూతుళ్ళు, నా అల్లుళ్ళు అని మురిసిపోయాను... మీ అందరి అవసరాలు తీర్చడం కోసమే నేనున్నానని ఇప్పుడర్థమౌతోంది" అంటూనే రామ్మోహన్ అక్కడ్నించి తనకు కేటాయించబడిన గదిలోకెళ్ళిపోయి బెడ్ మీదున్న దిండులో తలదూర్చాడు. ఉబికి వస్తున్న కన్నీళ్ళను ఆపుకోలేకపోయాడు.

* * * *

మరో రెండు నెలలు గడిచిపోయాయి.

మంజుల పూర్తిగా నార్మలైపోయి తన జాబ్‌లో జాయినయిపోయింది.

ఇప్పుడైనా తనకు విముక్తి లభిస్తుందేమోననుకున్నాడు రామ్మోహన్.

"ఇప్పుడైనా మనం మనూరికి వెళ్ళిపోదామా?" అన్నాడు రామ్మోహన్ ఊర్మిళతో.

"ఎలా వెళ్ళిపోతాం... మనం వెళ్ళిపోతే బాబునెవరు చూసుకుంటారు?" అంది ఊర్మిళ.

ఆమె అన్న ఆ మాటతో రామ్మోహన్ బుర్ర గిర్రున తిరిగిపోయినట్టని పించింది.

వస్తున్న కోపాన్ని కంట్రోల్ చేసుకుంటూ "బాబును చూసుకోవడానికి నువ్వుండిపో... నేను వెళ్ళిపోతాను... మన రిటర్న్ టికెట్ డేట్ కూడా దగ్గర పడింది... ఈసారి మాత్రం నన్నాపొద్దు..." అన్నాడు రామ్మోహన్.

"అమ్మను ఇక్కడుంచి మీరు వెళ్ళిపోతానంటున్నారా? అలాగే వెళ్ళండి నాన్న... ఇంకో మూడు నెలల తర్వాత అమ్మను పంపిస్తాం... అప్పుడు అరవింద్ వాళ్ళ అమ్మొస్తుందట... ఆమెను ఇప్పుడే రమ్మంటే రావడం లేదు. వాళ్ళమ్మాయికి పెళ్ళి కుదిరిందట... పెళ్ళయ్యాక మా అత్తా, మామ వస్తారట... అప్పటివరకు అమ్మ ఇక్కడే ఉంటుంది"

"మంచిది మంజులా! మీ అమ్మను నీకిష్టమైనన్ని రోజులుంచుకో... నన్నుమాత్రం పంపించేయ్" అన్నాడు రామ్మోహన్.

"అలాగే నాన్న! మీ రిటర్న్ టికెట్ డేట్.. ఈ నెల 14న... అంటే ఇంకో వారం రోజుల్లో మీరు వెళ్ళిపోవచ్చు... సారీ నాన్నా... మిమ్మల్నెక్కడకూ తీసుకుపోలేకపోయాం... మీకేమీ చూపించలేకపోయాం. ఆయన ఆఫీసు పనుల్లో చాలా బిజీగా ఉండిపోయారు... మీరు మళ్ళీ వస్తారుగా... అప్పుడు మిమ్మల్ని అమెరికా అంతా తిప్పుతాం" అంది మంజుల.

రామ్మోహన్ 14వ తేది ఎప్పుడొస్తుందా అని అనుక్షణం ఎదురుచూడసాగాడు. అతడు వెళ్ళడానికి ఇంకో రెండ్రోజులుందనగా, 12వ తేది నాడు అమెరికాలోనే ఉంటున్న రామ్మోహన్ చిన్నకూతురు స్వరూప ఫోన్ చేసింది. ఆమెకూడా ప్రెగ్నెంటయ్యిందట... ప్రెగ్నెంటయినప్పట్నించీ ఆమెకన్నీ సమస్యలేనట...

హాస్పిటల్‌కు వెళ్ళి టెస్టులన్నీ చేయిస్తే "అబార్షన్ అయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. కంప్లీట్ బెడ్‌రెస్ట్ అవసరం" అని డాక్టర్లు చెప్పారట... "నాకు చాలా భయంగా ఉందమ్మా! యేమీ తినటం లేదు. యేది తినబోయినా వాంతులొస్తున్నాయి... నువ్వు వెంటనే రావాలమ్మా... మీ అల్లుడు ఇంటర్నెట్ ద్వారా నీకు టికెట్ పంపిస్తున్నాడు... రేపే బయల్దేరి వచ్చెయ్... అక్కయ్య దగ్గర నాన్న ఉండి వాళ్ళ బాబును చూసుకుంటాడు. నువ్వు మాత్రం రేపే వచ్చెయ్యాలమ్మా... నాకు చాలా భయంగా ఉందమ్మా! ప్లీజమ్మా... నువ్వు నా పక్కనుంటేనే నేను ధైర్యంగా ఉంటానమ్మా..." అంటూ స్వరూప యేడుస్తూ చెబుతోంటే ఊర్మిళకు కూడా యేడుపొచ్చింది.

"అమ్మ చెల్లెలు దగ్గరకు... చికాగో వెళ్తోంది. మీరు మా బాబును చూసుకోవడానికి మరో మూడు నెలలు మా దగ్గర ఉండక తప్పదు నాన్నా..." అంది మంజుల.

"అవును మామగారూ! మీ రిటర్న్ టికెట్ డేట్‌ను మార్పిస్తాను... శ్రమ అనుకోకుండా మీరింకో మూడు నెలలు మాతో గడపండి... మీ వ్యవసాయంలో మీకెలాంటి నష్టం వచ్చినా దాన్ని నేను భర్తీ చేస్తాను. మీకేవైనా డ్రింక్స్ కావాలంటే తెచ్చిపెడ్తాను... మా అమ్మానాన్నలు రాగానే మిమ్మల్ని ఇండియా పంపించేస్తాం... ప్లీజ్ మామగారూ! మీరింకో మూడు నెలలు ఎలాగైనా ఓపిక తెచ్చుకొండి" అన్నాడు అరవింద్.

పెద్ద బండరాయొచ్చి తన తలమీద పడ్డట్టుగా ఫీలయ్యాడు రామ్మోహన్.

ఆ మర్నాడే ఊర్మిళ చికాగోకు వెళ్ళిపోయింది.

మంజుల, అరవింద్ ఆఫీసుకెళ్ళిపోయారు.

ఇంట్లో తనూ, బాబు – వాడి పేరు కిరణ్. వాడిని ఎప్పుడు పడుకోబెట్టాలో... ఎప్పుడు ట్రాలీలో పడుకోబెట్టి లాన్‌లో తిప్పాలో మొదలైన ఆదేశాలన్నీ ఇచ్చేసి ఊర్మిళ తన జాబ్‌కు వెళ్ళిపోయింది.

రామ్మోహన్‌కు తన తలను గోడకేసి బాదుకోవాలనిపించింది. తనకు నిజంగా పిచ్చెక్కితేనన్నా వీళ్ళ నుండి తనకు విముక్తి లభిస్తుందేమో అనుకున్నాడు.

తను వెంటనే ఈ ఇంట్లోంచి బయటకు పరిగెత్తి హరే రామ హరే క్రిష్ణలాంటి యే సన్యాసుల ఆశ్రమంలోనన్నా చేరిపోతే బావుండుననిపించింది... అదీ సాధ్యం కాకపోతే సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరేసుకొని ఈ లోకానికి గుడ్‌బై చెబితేనన్నా ఈ జైలు జీవితం నుండి విముక్తి లభిస్తుందేమోననిపించింది. తలపట్టుకొని యేం చేద్దామా? అని ఆలోచిస్తోంటే బాబును పడుకోబెట్టిన గదిలోంచి యేడుపు వినిపించింది. ప్రవాహంలా వస్తున్న ఆలోచనల కన్నింటికీ ఫుల్‌స్టాప్ పెట్టేసి రామ్మోహన్ బాబు దగ్గరకు వెళ్ళిపోయి వాడిని తన ఒడిలో పడుకోబెట్టుకొని పాలసీసాను వాడి నోట్లో పెట్టాడు. "ఇంతే... తన బతుకింతే... తనకీ బానిస బతుకు నుండి యేనాటికైనా విముక్తి లభిస్తుందా? తను తన దేశానికి, తన ఊరికి, తన వ్యవసాయ క్షేత్రానికి, తన ఫ్రెండ్స్ దగ్గరకు చేరుకుంటాడా?" అనుకున్నాడతడు.

✧✧✧✧✧

– 'నవ్య' దీపావళి 2011 ప్రత్యేక సంచిక